మానసిక ఆస్పత్రిలో సిబ్బంది కొరత

- ఉన్న స్టాఫ్ నర్సులపై పనిభారం
- మధ్యలో నిలిచిపోయిన ఖాళీల భర్తీ ప్రక్రియ
- పట్టించుకోని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు
- వేరే ఆస్పత్రి నుంచి స్టాఫ్ నర్సులను సర్దుబాటు చేయాలని వినతి


ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆస్పత్రి

ఖాళీలు ఇలా..

పోస్ట్ పేరు	ఖాళీలు
ప్రొఫెసర్	01
అసోసియేట్ ప్రొఫెసర్	01
అసిస్టెంట్ ప్రొఫెసర్	01
రెసిడెంట్	01
గ్రేడ్-2 ట్రెజరర్	01
డైటీషియన్	01
జూనియర్ అసిస్టెంట్	01
స్టాఫ్ నర్స్	10+(8)
ఇతర ఉద్యోగాలు	11
మొత్తం ఖాళీలు	28

బీచ్‌రోడ్డు: మానసిక ఆస్పత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వందల సంఖ్యలో ఉన్న రోగులకు పదుల సంఖ్యలో ఉండే సిబ్బంది సేవలందించడం కష్టంగా మారింది. ముఖ్యంగా స్టాఫ్ నర్సుల కొరత ఎక్కువగా ఉండటంతో రోగులకు సకాలంలో చికిత్స అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను గమనించిన గత ప్రభుత్వం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి.. మెరిట్ జాబితాను కూడా సిద్ధం చేసింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఐదు నెలలు గడిచినా ఈ విషయంపై స్పందించడం లేదు. దీంతో ఉన్న సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

సిబ్బందిపై పనిభారం

300 పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ సుమారు 250 మంది ఇన్‌పేషెంట్లు వైద్యం పొందుతున్నారు. అయితే ఇంత పెద్ద సంఖ్యలో రోగులకు కేవలం 42 మంది స్టాఫ్ నర్సులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజూ 5 నుంచి 10 మంది స్టాఫ్ నర్సులు వివిధ కారణాలతో సెలవులో ఉంటారు. దీంతో మిగిలిన వారిపై పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితి రోగులకు అందించాల్సిన వైద్య సేవలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ఖాళీల భర్తీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు

ఆస్పత్రిలో ఏ ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీవో నంబర్ 140, 141 ద్వారా పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. చాలా వరకు పోస్టుల భర్తీ అయినప్పటికీ, స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో అప్పటి ఆస్పత్రి ఉన్నతాధికారులు జాప్యం చేశారు. ఆ తర్వాత ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.రామిరెడ్డి ఈ విషయాన్ని అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు రాగా, ఆస్పత్రి ఉన్నతాధికారులు మెరిట్ జాబితాను సిద్ధం చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

సర్దుబాటు కోసం ఎదురు చూపులు

స్టాఫ్ నర్సుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆస్పత్రి అధికారులు.. ఇతర ఆస్పత్రుల్లో ఉన్న స్టాఫ్ నర్సులను సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇదే విషయమై విమ్స్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కొంత మంది స్టాఫ్‌నర్సులను సర్దుబాటు చేయాలని కోరగా.. ఇప్పటివరకు అటు నుంచి స్పందన రాలేదు. మరోవైపు సిబ్బందిని భర్తీ చేసే విషయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. నిలిచిపోయిన నోటిఫికేషన్‌ను కొనసాగించి పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా.. స్పందించడం లేదు. దీనిపై కలెక్టర్ దృష్టిసారించాలని రోగులు కోరుతున్నారు.

మరో మూడు విభాగాలు ప్రారంభానికి సిద్ధం

మానసిక ఆస్పత్రిలో పిల్లలు, వృద్ధుల మానసిక చికిత్స విభాగం, పునరావాస విభాగం, వ్యసన విముక్తి విభాగాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే భవనాలు పూర్తయ్యాయి. ఇప్పుడు ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఈ విభాగాల ద్వారా మరో 80 పడకలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇంకో 8 మంది స్టాఫ్ నర్సుల అవసరం ఏర్పడనుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



సిబ్బంది కొరత విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అదనంగా మరో మూడు విభాగాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. అందుకే వీలైనంత వేగంగా సిబ్బందిని నియమించాలని కోరాం. జీవో నంబర్ 140, 141 ద్వారా జారీ చేసిన నోటిఫికేషన్‌ను కొనసాగించాలని విన్నవించాం. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

–డాక్టర్ కె.రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

ముగిసిన 'అఖండ భజన'


సత్యసాయికి హారతి సమర్పిస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: ప్రపంచ శాంతి స్థాపన కోసం శ్రీ సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ అఖండ భజన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఎంవీపీ కాలనీ సత్యసాయి విద్యా విహార్‌లోని ప్రేమసదన్ మందిరంలో శనివారం సాయంత్రం 6 నుంచి నిర్విరామంగా 24 గంటలు సాగిన ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని, సత్యసాయి హారతి సేవ చేశారు.

నేడు హనుమత్ యజ్ఞం

మహారాణిపేట: ఎంవీపీ కాలనీ భద్రం కమ్యూనిటీ హాల్లో సోమవారం హనుమత్ యజ్ఞం భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. కందాల శ్యామ్, అరుణా గాయిత్రీ దంపతుల ఆధ్వర్యంలో పూర్వభాద్ర నక్షత్ర యుక్త కార్తీక సోమవారం నాడు ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కళింకోట గురువులు రేజేటీ రామాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 13న వాసవీ క్లబ్ నిర్వహణలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ సుమారు నాలుగు వేల మంది భక్తులతో గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కందాల శ్యామ్, అరుణా గాయిత్రి తెలిపారు.

క్లుప్తంగా

సూర్యనారాయణ ఆలయంలో స్వాముల సందడి


శ్రీకృష్ణాపురంలో అయ్యప్ప స్వాములతో సందడిగా సూర్యభగవానుడి ఆలయం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం సూర్య భగవానుడి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. ఓ వైపు సాధారణ భక్తులతోపాటు అయ్యప్ప మాలధారులు వందల మంది స్వామిని దర్శించుకుని పూజలు చేయడంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఆదివారం సూర్యనారాయణుడికి పవిత్రమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు స్వామికి పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల అనంతరం ఇక్కడ ఏడు గుర్రాలతో ఉన్న సూర్యనారాయణడి రథం ఎదురుగా సెల్ఫీలు తీసుకొని సందడి చేశారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రత మహోత్సవాన్ని నగర భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రేటర్ విశాఖ కళింగ కోమటి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున దంపతులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. వ్రతం అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు.

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన


పార్క్‌లో కళాశాల విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: నర్సీపట్నంకు చెందిన ఒక ప్రైవేటు కాలేజ్ విద్యార్థులు ఆదివారం పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వివిధ మొక్కల కోసం పాఠ్యాంశంలో నేర్చుకున్న విషయాలను నేరుగా చూసి వాటి గుణాలను తెలుసుకోవడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పార్క్‌లో గడిపారు.

కంబాలకొండలో బోటు షికారు


కంబాలకొండ కొలనులో బోట్లతో షికారు చేస్తున్న సందర్శకులు

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో సందర్శకులు సందడి చేశారు. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి నెలకొంది. అధిక సంఖ్యలో వనభోజనాలు జరుపుకొన్నారు. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణంలో గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలు ఆటపరికరాల వద్ద సరదాగా ఆడుకొని గడిపారు. ఇక్కడి కొలనులో ఎక్కువ మంది సందర్శకులు కయాకింగ్ బోట్లు, ఫ్యామిలీ బోట్లు, రౌండ్ బోట్లలో షికారు చేశారు. దీంతో ఈ కొలను వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా మారింది. సుమారు 400 మంది కంబాలకొండ పార్కును సందర్శించారు. వారి ద్వారా రూ. 26,000 ఆదాయం సమకూరినట్లు కంబాలకొండ నిర్వాహకులు తెలిపారు.

పోటీల విజేతలకు సత్కారం


ఆళ్ల రామలక్ష్మి, గౌతమ్‌లను సత్కరిస్తున్న మళ్ల అప్పలరాజు, ఆడారి పరదేశి, సంఘ సభ్యులు

మద్దిలపాలెం: నేపాల్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ ఫోర్త్రా పవర్ లిఫ్టింగ్‌తోపాటు ఆరు అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆళ్ల రామలక్ష్మి, ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన కాళ్ల గౌతమ్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. పాతవెంకోజీపాలెం శ్రీ సీతారామా సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానికులంతా వారిని సత్కరించి నగదు పురస్కారం అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ గౌరవాధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు, ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి ఎంపిక


కృష్ణా కళాశాల విద్యార్థి చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: మహారాష్ట్రలో జరగనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్–2024కు డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.ఎ.చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. వెస్ట్ జోన్ జాతీయ సేవా పథకం ప్రీ–రిపబ్లిక్ శిక్షణ ఈ నెల 12 నుంచి 21 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం చరణ్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

శరవేగంగా బ్యాడ్మింటన్ అకాడమీ పనులు


తోటగరువు ప్రాంతంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణ పనులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన అంతర్జాతీయ క్రీడాకారిణి పి.వి.సింధు బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని పి.వి.సింధు అకాడమీ కోసం కేటాయించిన విషయం తెలిసిందే. ఆ స్థలాన్ని ఇటీవల ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు అప్పగించింది. దీంతో ఈ స్థలంలో పి.వి.సింధు ఈ నెల 7న తల్లిదండ్రులతో కలసి భూమిపూజ చేశారు. ఏడాదిలో ఇక్కడ అకాడమీ నిర్మాణం పూర్తి చేస్తామని సింధు వెల్లడించారు. అప్పటి నుంచి ఇక్కడ నిరాటంకంగా పనులు జరుపుతున్నారు. స్థలం చుట్టూ ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ వేశారు. దాని లోపల పొక్లెయిన్‌తో స్థలం చదును చేయించి పనులు జరిపిస్తున్నారు. దీంతో ఆరిలోవ ప్రాంతంలో అంతర్జాతీయ స్పోర్ట్స్ అకాడమీ అందుబాటులోకి రానుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిన శ్మశానవాటిక


శ్రీకృష్ణాపురం శ్మశానవాటికలో దట్టమైన పిచ్చిమొక్కలు


ఇరువైపులా పిచ్చిమొక్కలతో శ్మశానవాటిక రహదారి

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం శ్మశానవాటిక పిచ్చి మొక్కలతో నిండిపోయింది. స్థానికులు మరణించిన వారి అంత్యక్రియలు చేయడానికి సైతం ఇక్కడ వీలుకాని పరిస్థితి నెలకొంది. శ్రీకృష్ణాపురంతోపాటు విశాఖ కేంద్ర కారాగారం క్వార్టర్స్‌లలో మరణించిన వారికి ఈ శ్మశానంలోనే అంత్యక్రియలు జరుపుతుంటారు. బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని ఉన్న ఈ శ్మశానవాటిక లోపల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. దీంతో పాటు మృతదేహాలను శ్మశానంలోకి తీసుకువెళ్లే రహదారి ఇరుపక్కలా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. సుమారు 20 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డు నాలుగడుగులకు కుదించుకుపోయింది. రెండు పైపులా ఏపుగా పెరిగిన మొక్కలు రోడ్డును కప్పేశాయి. ఇటీవల విశాఖ కేంద్ర కారాగారం క్వార్టర్స్‌లో అనారోగ్యంతో ఓ వ్యక్తి మరణించాడు. ఆయనకు అంత్యక్రియలు చేయడానికి మృతుడి బంధువులు శ్మశానంలో పిచ్చి మొక్కల మధ్య నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కొద్ది రోజుల కిందట శ్రీకృష్ణాపురంలో మరణించిన వ్యక్తి దహన సంస్కారాలకు ఇదే పరిస్థితి ఎదుర్కొన్నామని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ శానిటరీ విభాగం సిబ్బంది శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

దూసుకొస్తున్న వాహనాలు


ఉదయం వేళ బీచ్ రోడ్డులో వాహనాలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు అనేక మంది వాహనాలపై దూసుకొస్తున్నారు. బీచ్ రోడ్డులో ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చే వారు భయపడే పరిస్థితి నెలకొంది. పోలీసులు ఎంతగా కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నా.. బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న వీధుల నుంచి కొందరు వాహనాలతో వచ్చేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఉదయం వేళ బీచ్ రోడ్డులో అవగాహన నడకలు, ర్యాలీలు జరుగుతుంటాయి. ఈ రెండు రోజుల్లో బీచ్ రోడ్‌లో వాహనాలను ఉదయం 8 గంటల వరకు అనుమతించకుండా ఉంటే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతంగా 'షోల్డర్ ఆర్థోస్కోపీ' సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

బీచ్‌రోడ్డు: భుజం అస్థిరతపై అత్యాధునిక వైద్య నైపుణ్యం కోసం వివరించేందుకు ఐఏఎస్ ఒన్ వైజాగ్–షోల్డర్ ఆర్థ్రోస్కోపీ పేరుతో ఆదివారం నిర్వహించిన సమ్మిట్ విజయవంతంగా ముగిసింది. రామ్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆరుముగమ్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, క్లిష్టమైన శస్త్రచికిత్సలకు అవసరమైన సౌకర్యాల కోసం అవగాహన పెంచుకునేందుకు ఈ సదస్సు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి మయూఖ్ చౌదరి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీలో రహదారుల ఆక్రమణ


రోడ్డుపై ఏర్పాటు చేసిన షాపు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ ఆక్రమణలకు అడ్డాగా నిలిస్తోంది. గెడ్డలు, పార్కులు ఒకవైపు కబ్జాలకు గురవుతుంటే.. మరోవైపు అతి ఇరుకైన రోడ్లను కూడా ఆక్రమణదారులు వదలడం లేదు. ఇందుకు నిదర్శనం అతి ఇరుకు రోడ్లతో ఉండే పిఠాపురం కాలనీ నుంచి శివాజీపాలెం రోడ్డును ఆక్రమించుకొని షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే రాకపోకలకు ఇబ్బంది పడే ఆ రోడ్డులో ఒక పెద్ద షాపు ఏర్పాటు చేయడం చర్చనీయంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే ఏర్పాటు చేసిన ఆ దుకాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గర్భిణులకు వైద్యుల పర్యవేక్షణ అవసరం

బీచ్‌రోడ్డు: జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఒత్తిడి కారణంగా గర్భం దాల్చిన మహిళలకు వైద్యుల పర్యవేక్షణ చాలా అవసరమని గైనకాలజిస్ట్ డాక్టర్ సుబ్బరాజు అన్నారు. సిరిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన లోటస్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గర్భం దాల్చిన నాటి నుంచి నిరంతరం శిశువు ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలతోపాటు పౌష్టికాహారం తీసుకోవడం, వైద్యుల సలహాలు పాటించడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డను పొందవచ్చన్నారు. లోటస్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ వి.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. డాక్టర్ హేమప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ముక్కలైన స్కూటీ


రోడ్డు ప్రమాదంలో ముక్కలైన స్కూటీ

ఆరిలోవ: హనుమంతవాక సమీపాన బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనం రెండు ముక్కలైంది. ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా.. ఆదివారం మధ్యాహ్నం ఆదర్శనగర్‌కు చెందిన ముగ్గురు యువకులు స్కూటీపై బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో పెదగదిలి వైపు వెళ్తున్నారు. అదే లైన్‌లో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు ఓ కారు వస్తోంది. ఆ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ పాత పందుల ఫారం ముందు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. వారు నడిపిన స్కూటీ రెండు ముక్కలైంది. దాని నుంచి టైర్ విడిపోయింది. బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో వీవీఐపీ వాహనాలు, ఆర్టీసీ బస్‌లు తప్పా ఇతర వాహనాలు నడపకూడదు. దానికి సంబంధించి ట్రాఫిక్ పోలీసులు కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా పెట్టారు. అయినా వాటిని పట్టించుకోకుండా అదే లైన్‌లో ప్రయాణించి ప్రమాదాలకు కారణమవుతున్నారని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'సత్యసాయి' విద్యార్థుల సేవా కార్యక్రమాలు


ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: 'అందరినీ ప్రేమించండి – అందరినీ సేవించండి' అని పలికిన సత్యసాయిబాబా దివ్య సందేశంతో శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి బాబా 99వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చినవాల్తేరు ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆస్పత్రిలో సేవలందించారు. ఇక్కడ 300 మందికి పైగా రోగులకు విద్యార్థులు స్వయంగా సేకరించిన నిధులతో ఆహారం సిద్ధం చేసి వడ్డించారు. వివిధ రకాల కిరాణా సామగ్రి, నిత్యావసర సరకులు, పలు రకాల పండ్లతో కూడిన కిట్లు రోగులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యావిహార్ ఉపాధ్యాయులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య సేవలు


మహిళలను పరీక్షిస్తున్న వైద్య బృందం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి వికాస తరంగిని ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ పేరిట ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్ పరీక్ష, కాల్పోస్కోపీ పరీక్ష నిర్వహించారు. మహిళల ఆహారపు అలవాట్లు, శారరీక శ్రమ తగ్గిపోవడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మంగవేణి, వికాస తరంగిని సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, డాక్టర్ వసంత బృంద సభ్యులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ ఉపాధ్యాయుల రెగ్యులర్‌కు వినతి


ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు సమస్య వివరిస్తున్న 2008 డీఎస్సీ జేఏసీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: డీఎస్సీ–2008కి చెందిన ఉపాధ్యాయులు(ఎంటీఎస్) తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2008 డీఎస్సీ స్టేట్ జేఏసీ ఎంటీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ 2008 నోటిఫికేషన్ విడుదల చేసిన 54 రోజుల తరువాత అప్పటి ప్రభుత్వం రూల్స్ మార్చడంతో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయినట్లు తెలిపారు. వీరికి న్యాయం చేయాలని హైకోర్టు, సుప్రీం కోర్టులు తీర్పులు ఇచ్చాయన్నారు. దీంతో 2008 డీఎస్సీకి సంబంధించిన 2,193 మంది అభ్యర్థులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమించిందని చెప్పారు. మినిమం టైం స్కేల్‌గా పరిగణిస్తూ నియామక పత్రాలు అందజేసిందన్నారు. కొద్దికాలం వ్యవధిలో రెగ్యులర్ చేస్తామని చెప్పినా అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ ఎంటీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. మంత్రి లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి రెగ్యులర్ చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ చిరంజీవి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. జేఏసీ ప్రతినిధులు మూర్తి, రాజు, లింగమూర్తి, నూకిశెట్టి, వసంతకుమార్, సుధ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి


ఎంవీపీ రైతుబజార్‌లో ఉల్లిపాయలు

ఆరిలోవ: కార్తీక మాసం వచ్చిందంటే చికెన్ ధరలు మాదిరిగా ఉల్లి ధరలు కూడా తగ్గుతాయి. ఈ నెలంతా ఎక్కువ మంది ఉల్లి వాడటం మానేస్తారు. అయితే కొద్ది రోజులుగా ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. దీంతో ఉల్లిపాయలను కొని కోయక ముందే ప్రజలను కన్నీరు పెట్టిస్తోంది. వాటి ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వినియోగదారుల కళ్లలో నీరు తిరుగుతోంది. వారం రోజులుగా ఉల్లి ధర పెరుగుతూ వస్తోంది. వీటి ధర ఇంకా పెరగనుందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వినియోదారులు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా అన్ని రకాల ఉల్లి ధరలు పెరగడం విశేషం. రైతుబజార్లలో ఈ నెల 1న కర్నూలు ఉల్లి కిలో రూ.26, సోలాపూర్ ఉల్లి కిలో రూ.44, మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.50 ఉండేది. శుక్రవారం వాటి వాటి ధరలు కిలో రూ.40, రూ.54, రూ.58కు పెరిగింది. దీంతో వినియోగదారులు తప్పక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని కూరగాయల ధరలతోపాటు ఉల్లి, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీటి ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.